క్లుప్తంగా

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



తాడూరు: మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాలకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో మైక్‌సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో బాదం రాఘవేందర్, శివ, శ్రీనివాసులు, సాయిప్రభ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వెల్దండ: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు కలుగుతుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉబ్బలగట్టుతండాకు చెందిన బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆర్. కంసాకు రూ.24వేలు, గోపాల్‌కు రూ.15వేలు, ఆర్.విజయ రూ.17వేల చొప్పున అందించారు.

ఆలయానికి విరాళం

వెల్దండ: మండలంలోని మల్లయ్యగుండుతండాలో కాళిమాత దేవాలయ అభివృద్ధికి శనివారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.50వేలను విరాళంగా అందించారు. ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ చైర్మన్ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లిటిల్ బడ్స్‌లో వార్షికోత్సవం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని లిటిల్‌బడ్స్ పాఠశాలలో శనివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శన, డ్రామా చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రఘుపతిరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, రుతురాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోనమెత్తిన గుమ్మకొండ



బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని గుమ్మకొండలో కోటమైసమ్మ, బొడ్రాయి ఉత్సవాలు సందర్భంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి కోటమైసమ్మకు సమర్పించారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం



తాడూరు: మండలంలోని అల్లాపూర్‌లో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరి పాక్షికంగా కూలిపోయింది. దీంతో నిర్వహణ కష్టంగా మారింది. ప్రాథమిక పాఠశాల ఆవరణలో తాత్కాలికంగా ఒక గదిలో ఏర్పాటు చేశారు. కూలిన అంగన్‌వాడీ భవనాన్ని పూర్తిగా కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులకు కోరుతున్నారు.

ఏకపక్షంగా కమిటీ ఎన్నిక చెల్లదు

మహబూబ్‌నగర్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాలల స్ఫూర్తి భవన నిర్మాణ కమిటీని ఏకపక్షంగా ఎన్నుకున్నారని, అన్ని మాల సంఘాల అభిప్రాయాలతో నూతన కమిటీని ఎన్నుకోవాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి అన్నారు. శనివారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు జి.చిన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ మాలల స్ఫూర్తి భవన నిర్మాణం కోసం క్రిష్టియన్‌పల్లి శివారులోని 523 సర్వేనంబర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెయ్యి చదరపు గజాల స్థలాన్ని కేటాయించి అన్ని సంఘాలతో కలిసి ఒక కమిటీ వేసుకొని భవన నిర్మాణం చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ఒకటి, రెండు సంఘాల నాయకులు మాత్రమే నియంతృత్వ పోకడలతో కమిటీని ఎన్నుకున్నారని అన్నారు. కమిటీ చైర్మన్ నేనే అంటూ తనకు తానే ప్రకటించుకున్న మంత్రి నర్సింహయ్య నిర్ణయం సరైంది కాదన్నారు. అన్ని మాల సంఘాల నాయకులతో కలిసి అందరి సమక్షంలో కమిటీని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకపోతామని అన్నారు.

సబ్‌స్టేషన్ పనులు పూర్తయ్యేనా?

- అసంపూర్తిగా మిగిలిపోయిన వైనం
- లో ఓల్టేజీతో చెడిపోతున్న మోటార్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు



వెల్దండ మండలం పోతేపల్లిలో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

వెల్దండ: రైతులకు లోఓల్టేజీ సమస్య పరిష్కరానికి ప్రభుత్వం కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసింది. దీంతో రైతులకు విద్యుత్ కష్టాలు తీరిపోతాయని సంతోషం వ్యక్తం చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో సబ్‌స్టేషన్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మండలంలోని పోతేపల్లిలో లోఓల్టేజీ సమస్య తీర్చేందుకు 2018లో 33.11కెవీఏ సబ్‌స్టేషన్‌ను మంజూరైంది. ప్రభుత్వం ఇందుకు రూ.1.20కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, దొడ్లపల్లి, ఎంజీ తండా, అల్లంతోటబావితండా, పోషమ్మగడ్డతండా గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు పనులు దక్కించుకుని ప్రారంభించారు. కొంత వరకు పనులను పూర్తి చేసి అర్ధాంతరంగా నిలిపివేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్, సబ్‌కాంట్రాక్టర్‌కు మధ్య బిల్లుల సమస్య వచ్చి మధ్యలో నిలిపివేశారు. దాదాపుగా పనులు నిలిచి మూడేళ్లు ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఐదు నెలల క్రితం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను గ్రామస్తులు, రైతులు సబ్‌స్టేషన్ పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్వయంగా పనులను పరిశీలించి రెండు నెలల్లో పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

లోవోల్టేజీ సమస్య..

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా కేఎల్‌ఐ కాల్వ ద్వారా నీరు వస్తుంది. దీంతో రైతులు పంటలను అధిక సంఖ్యలో సాగుచేశారు. విద్యుత్ వినియోగం అధికం కావడంతో తరుచుగా లోవోల్టేజీతో మోటార్లు చెడిపోతున్నాయి. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్లుగా ఎదురుచూసిన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తి కాలేదు. అధికారులు స్పందించి పనులను పూర్తిచేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

మోటార్లు చెడిపోతున్నాయి..



గ్రామంలో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది. వ్యవసాయ బోరు మోటార్లు తరుచుగా చెడిపోతున్నాయి. సాగుచేసిన పంటలు చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. నీరు ఉన్నప్పటికీ లోవోల్టేజీతో పంటలను కాపాడుకోలేకపోతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– మల్లేష్, రైతు, లింగారెడ్డిపల్లి

పంటలు ఎండిపోతున్నాయి..



బోరుబావి, కేఎల్‌ఐ కాల్వలో నీరు పుష్కలంగా ఉన్నా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. వేరుశనగా పంటలు చేతికందే దశలో ఉన్నాయి. కాపాడుకోవాడానికి రాత్రి, పగలు విద్యుత్ సరఫరా కోసం ఎదురుచూస్తున్నాం. కేఎల్‌ఐ కాల్వ ద్వారా నీరు రావడంతో గ్రామంలో రైతులు వరిపంటలను అధిక సంఖ్యలో సాగుచేశారు. సబ్‌స్టేషన్ పూర్తి చేసి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలి.

– గెల్వయ్య, రైతు, పోతేపల్లి

త్వరలోనే పూర్తి చేస్తాం..



పోతేపల్లిలో అసంపూర్తిగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తాం. సంబంధిత కాంట్రాక్టర్లను సంప్రదించి పనులను ప్రారంభిస్తాం. లోవోల్టేజీ సమస్యను ఉన్న మాట వాస్తవం. కేఎల్‌ఐ కాల్వ రావడంతో విద్యుత్ మోటార్ల పెరగడంతో సమస్య ఎక్కువైంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులను పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తాం.

– సూర్యం, ట్రాన్స్‌కో ఏఈ, వెల్దండ

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామం నుంచి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఆత్మీయులందరూ హాజరుకావాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చూసి ప్రతిపక్షపార్టీల నాయకులు విమర్శలు చేస్తునారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీమెజార్టీతో గెలిపించుకోవాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. గ్రామ గ్రామాన పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. అనంతరం ఏవీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసి ఆత్మీయ సమ్మేళన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ దార్ల కుమార్, భూపతిరెడ్డి, భాస్కర్‌రావు, జంగయ్య యాదవ్, అలీ, యాదగిరి, శ్రీను పాల్గొన్నారు.

శక్తివంచన లేకుండా పనిచేయాలి



మాట్లాడుతున్న జగదీశ్వర్‌రావు

పెద్దకొత్తపల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ విజయభావుట ఎగరవేస్తుందని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు జగదీశ్వర్‌రావు అన్నారు. ముష్టిపల్లిలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ విజయానికి కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని అన్నారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరుతారనే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. గ్రామంలో ఉన్న పార్టీ కార్యకర్తలు అందరిని సమీకృతం చేసుకుని పార్టీ కోసం పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాముయాదవ్, వెంకటేష్, కొండల్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలపీరు, మురళీధర్‌రెడ్డి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం మండల కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు నియోజకవర్గ అధ్యక్షుడు బాలపీరు తెలిపారు. అధ్యక్షుడిగా ఫయాజ్, కోఆర్డినేటర్‌గా షబ్బీర్‌లను ఎన్నుకున్నారు.

కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు శనివారం సాయంత్రం జగదీశ్వర్‌రావు పట్టణంలోని ఈద్గా ప్రాంగణంలో ఇఫ్తార్ ఇచ్చారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

కందనూలు: సలేశ్వరం జాతరలో మృతి చెందిన భక్తుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని హిందూ వాహిని విభాగ్ కన్వీనర్ అభిలాష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ప్రభుత్వం హిందువులు, దేవాలయాలపై నిర్లక్ష్యం చూపుతుందనడానికి సలేశ్వరంలో మరణాలే సాక్ష్యం అన్నారు. దేవాలయాల నుంచి వచ్చే ఆదాయం తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ, సౌకర్యాలు కల్పించడంలో లేదని విమర్శించారు. జాతరలో చనిపోయిన ఒక్కో కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణాచైతన్య, ఉదయ్, వివేక్, వినయ్, మల్లికార్జున్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము రాకుండా చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

తాడూరు: మండల కేంద్రం నుంచి ఎంబెట్ల మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు పనుల ఆలస్యంపై 'ఈ రోడ్డు నిర్మాణం ఇంకెన్నాళ్లు' అనే శీర్షికన శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ట్యాంకర్ ద్వారా నీటిని రోడ్డుపై చల్లించడంతో పాటు రోలర్‌తో కంకరపై రోలింగ్ చేయించారు. కంకర వేసి 20 రోజులు కావస్తున్న నీటిని చల్లకపోవడంతో రోడ్డుపై వాహనాల రాకపోకలకు దుమ్ములేచి దారి కనపడకుండా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తరలిన బీజేపీ శ్రేణులు



తాడూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభకు శనివారం మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల నుంచి బీజేపీ శ్రేణులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో లోహిత్‌రెడ్డి, బాలస్వామి, జంగయ్య, రాములు, రాము, కిరణ్ తదితరులు ఉన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. మండలంలోని చెన్నారం గేటు వద్ద శనివారం సాయంత్రం రోడ్డుపై రాస్తారోకో చేస్తుండగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

'ఉపాధి' కొన్ని పనులకు పరిమితం



పెద్దాపూర్ శివారులో ఫీడర్ చానల్ పనులు చేస్తున్న ఈజీఎస్ కూలీలు

ఉప్పునుంతల: జాతీయ ఉపాధిహామీ పథకంలో రైతులకు, కూలీలకు ప్రయోజనం చేకూర్చే పలురకాల పనులను రూపకల్పన చేసినా కొన్నింటికి పరిమితమవుతున్నారు. పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ పథకంలో నిర్దేశించిన విధంగా 74 రకాలు పనులను చేపట్టే అవకాశం ఉంది. ఏటా భూమి చదును, చెట్ల తొలగింపు తదితర భూ అభివృద్ధి పనులే చేస్తున్నారు. తోటల పెంపకంపై అంతగా ఆసక్తి చూపడంలేదు. మండలంలో 9,955 జాబు కార్డులు ఉండగా వాటిలో 5,500ల జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. మొత్తం కూలీలు 21వేల మంది ఉన్నారు. ప్రస్తుతం మండలంలోని దాసర్లపల్లి, ఉప్పరిపల్లి తదితర గ్రామాల్లో 700 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు.

ప్రయోజనం చేకూర్చే పనులు

ఈజీఎస్‌లో రైతులకు ప్రయోజనం చేకూర్చే పలురకాల పనులు ఉన్నాయి. కంపోస్టు ఎరువు గుంత, వ్యవసాయ పొలాల్లో పంట నూర్పిడి కల్లాలు, వ్యవసాయ పొలాల్లోకి రోడ్లు వేసుకోవడం, భూ ఉపరితల నీటి కుంటలు, కొత్త సేద్యపు బావుల తవ్వకం, వర్మీ కంపోస్టు పిట్‌లు, కొత్తగా పంట కాల్వలు, ఉమ్మడి భూముల్లో పశువుల నీటి కోసం కుంటల నిర్మాణం, పలురకాల పనులను చేపట్టి రైతులు వ్యక్తిగతంగా సామూహికంగా ఈజీఎస్‌లో ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో పనులపై రైతుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రామసభల్లో వివరిస్తున్నాం..



ఈజీఎస్‌లో పనుల ఎంపిక కోసం ఏర్పాటు చేసే గ్రామ సభల్లో పనుల వివరాలను వివరిస్తున్నాం. పథకంలో నిర్దేశించిన పనులు చేసుకోవడానికి ముందుకు వచ్చే రైతుల పొలాల్లో పనులు చేయించడానికి సిద్ధంగా ఉన్నాం. జాబు కార్డు కలిగి ఉండి 5 ఎకరాల లోపు భూమి ఉన్న చిన్నకారు రైతులు తాము చేయించుకోదలచిన పనులను పంచాయతీ తీర్మానంతో దరఖాస్తు చేసుకుంటే పనులు చేయిస్తాం. జాబ్‌కార్డులేని కూలీలకు జాబ్‌కార్డులు అందజేసి పనులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నాం.

– సుదర్శన్‌గౌడ్, ఈజీఎస్ ఏపీఓ, ఉప్పునుంతల

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: చేతి వృత్తులను నమ్ముకుని జీవిస్తున్న విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. యువతకు రుణాలు అందిస్తామన్నారు. వృత్తి పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారం చేస్తామన్నారు. పట్టణంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించి పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహ గౌడ్, విష్ణుమూర్తి, లింగాచారి, చంద్రమౌలి, విష్ణు మూర్తి, మల్లాచారి, బాలస్వామి, నాగరాజు, ఉమా శంకర్, భీమాచారి, గోపాలాచారి, జయమ్మ, మాధవి, రాధిక, జ్యోతి పాల్గొన్నారు.

మన్ననూర్: బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలను ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు శనివారం కలుసుకుని ఆత్మీయంగా పలకరించారు. ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని పదర మండలం రాయలగండి చెన్నకేశవ స్వామి ఆలయం ప్రాంగణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. వివిధ అభివృద్ధి పథకాలకు అమ్రాబాద్ మండలానికి రూ. 10 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాంబాబు, చెన్నకేశవులు, రాజారాం, శ్రీనివాసులు, రవి, రామచంద్రయ్య, ధర్మయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని జినుకుంట కనకాల మైసమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా శనివారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పూజలు చేశారు. అనంతరం మండలంలోని కొండారెడ్డిపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన మారంచంద్రయ్య కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు.

కమ్యూనిస్టు నాయకుడికి ఘననివాళి



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: పేదల అభ్యున్నతి కోసం కందికొండ రామస్వామి కమ్యూనిస్టుగా మారి తన జీవితాన్ని అంకితం చేశారని సీపీఎం నాయకులు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రామస్వామి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేసిన నాయకుడని కొనియాడారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా నమ్మిన సిద్ధాంతం కోసం సాదాసీదాగా బతికి తన కుటుంబాన్ని పార్టీకి అంకితం ఇచ్చాడన్నారు. ఆయన అడుగుజాడల్లో కార్యకర్తలు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పర్వతాలు, శ్రీనివాసులు, గీత, రామయ్య, కాశన్న, యాదయ్య, మోహన్, శివశంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా ఉంటాం



దీక్ష చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

కల్వకుర్తిరూరల్: నిరుద్యోగులకు అండగా ఉంటామని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కన్వీనర్ అర్జున్‌రెడ్డి అన్నారు. టీసేవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మొదట బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టి దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న లక్షా90 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లకు జారీ చేయాలని, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, కమాలుద్దీన్, కుద్దూస్, సాయిలు, సురేష్, గోపాల్, దేవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థం



ఉత్సవమూర్తులకు మంగళహారతులు ఇస్తున్న మహిళలు

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం చక్రతీర్థం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకరించిన పల్లకీలో ఉంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఉత్సవ మూర్తులను ఆలయ ప్రధాన అర్చకుడు రామాచారి జలంతో శుద్ధి చేసి పూజలు చేశారు.

విభజన హామీలు అమలు చేయాలి



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ విభజన సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం నిరసన చేపట్టారు. జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం విడిపోయిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు 10 నిర్దిష్ట హామీలు ఇచ్చిందని, అందులో ఏ ఒక్కటీ అమలు చేయకుండా ఎన్నికల పర్యటనకు మోదీ వస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా బయ్యారంలో బొగ్గు ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, హనుమకొండలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తదితర హామీలు అమలు చేయడంలో మాట నిలుపుకోలేదన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదని, సింగరేణి, బొగ్గు గనులు సంస్థలకు టెండర్ ఇవ్వకుండా సింగరేణిని ప్రైవేటీకరణ చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎల్‌ఐసీ, రైల్వే, విమానాశ్రయాలు, ఓడరేవులతో పాటు ప్రభుత్వ సంస్థలను అమ్మేశారని ఆరోపించారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, ప్రతి వ్యక్తి ఖాతాలో రూ.15 లక్షలు, రైతుల ఆదాయం రెండింతలు హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సామాన్యులు వాడే వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి తీవ్రమైన భారాలు మోపారని విమర్శించారు. హామీలను అమలు చేయాలని లేని పక్షంలో తెలంగాణలో అడుగుపెట్టరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, గీత, రామయ్య, కాశన్న, యాదయ్య, శివశంకర్, లక్ష్మీప్రియ, సుధాకర్, ఆంజనేయులు, రాజురాం, చందు, తిరుపతయ్య పాల్గొన్నారు.

మోదీ పర్యటనపై నిరసన

కొల్లాపూర్: ప్రధాని మోదీ పర్యటనను నిరసిస్తూ శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. మోదీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సింగరేణి ప్రైవేటీకరణపై సమాధానం చెప్పాలన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వడం లేదో వెల్లడించాలన్నారు. కార్యక్రమంలో శివవర్మ, తారాసింగ్, ముంతాజ్‌అలీ, చంద్రునాయక్, రాజు తదితరులున్నారు.